# ఆమె పాడిన పాట

-ప్రొ. ముదిగొండ శివప్రసాద్

పక్క డాబాపై నుండి పాట వినబడుతున్నది.

'రాకా చంద్రుడు వెన్నెల జల్లును ఆకాశంలో చల్లెనూ'

స్పష్టంగా వినిపిస్తున్నదా పాట.

ఆకాశంలో పచ్చపువ్వులా చంద్రుడు వికసిస్తున్నాడు. గాలులు కొంచెం చిరుచలిగా వస్తున్నాయి. దూదిపింజలవంటి తెల్లని మబ్బులు మంచును నింపుకుని గర్భిణీ స్త్రీలవలె పాలిపోయి మందమందగా నడుస్తున్నాయి. పాట తియ్యగా అమృతంవలె వ్యాపిస్తున్నది. పులకితుడైనాను.

ఓహో! ఏమి గానమిది. గంధర్వగానం. అంతేనా? చాలదీ ఉపమానం.

లేచి నిలుచుని పక్క డాబా వైపు చూసాను. ఆమె ఎవరో ఒంటరిగానే వున్నట్టున్నది. గొంతెత్తి చంద్రుడ్ని చూస్తూ ఏకాంతంగా తన్మయత్వంతో పాడుతున్నది.

ఓహో! పరవశించిపోతున్నది నా మనసు. ఇంతలో తపోభంగమైన రుషివలె కలవరపడ్డాను.

గానం ఆగిపోయింది. ఎవరో చప్పట్లు చరిచారు.

అటు చూశాను. ఆమె పాటను వింటూ వున్న మరొక గొంతు ఏదో వ్యాఖ్యానిస్తున్నది. ఆ గొంతు పురుషునిది., ఆమె తియ్యగా విరిసిన మల్లెపూవుల జలుల్లవంటి నవ్వుల వంతెనను నిర్మిస్తున్నది. నా మనసు బాధపడింది.

''ఏమండీ పాట ఆపకండి'' అని కేకలేస్తూ లేచాను. కానీ నిజానికిది భ్రమ. కేక వేయలేకపోయాను. సంఘం, సంప్రదాయం నన్ను తెలియకుండానే అణచివేసాయి. సంస్కారమెంత బలీయమైనదో ఇప్పుడు తెలిసింది. గొంతులో ధ్వని గొంతులోనే ఆగిపోయింది.

నిరాశతో, సాయంకాలపు పద్మంవలె బిక్కమొగంతో అటు చూశాను.

అతడు... ఎవరో ఆమెను ఏదో అన్నాడు.

ఆమె మళ్లీ నవ్వి ఏదో జవాబు చెబుతున్నది. నిస్సహాయుడ్ని నేను.

ఏం చేయను?

ప్రక్క మేడమీద పాట ఆగిపోయింది.

పకపక నవ్వుతున్నారిద్దరూ. నిశ్శబ్దాన్ని భుజిస్తూ ఆకాశానికి కళ్లతో లంకెవేసి అలాగే నిర్లిప్తంగా పడుకున్నాను.

ఎప్పుడో నాకు తెలియకుండానే నిద్రపట్టింది.

మరునాడు ఉదయం ఒక్కసారి ఆ మేడవైపు చూసాను.

ఏదో తెలియని ఆవేశం వచ్చింది.

వాళ్లింటికి వెళ్లాలి. వెళ్లి ఏం చేయాలి తరువాత? ముందు వెళ్లాలి. అంతే. కాళ్లకు చెప్పులు తగిలించి బయలుదేరాను.

గేటు తీసి వాళ్ల ఇంటిలోనికి ప్రవేశించాను. సన్నగా రేడియో సంగీతం వినబడుతున్నది. కిరణ్ వ్రాసిన దేశభక్తి గీతమది. తేలిగ్గానే పోల్చుకున్నాను నేను.

లోనికి వెళ్లాను. హాలులో ఎవరూ లేరు.

సోఫాలో కూర్చున్నాను.

కొన్ని క్షణాలు నిశ్శబ్దం. తర్వాత పనిమనిషి వచ్చి తొంగి చూచి లోనికి పోయింది. ఆమె ఏమి చెప్పిందో మరి... ఇంటి యజమాని బయటకు వచ్చాడు.

నమస్కరించాను.

ప్రతి నమస్కారం చేయకుండా కూర్చున్నాడు.

బాగా పరిశీలించాను. టెర్లిన్ స్లాక్, టెర్లిన్ పాంట్, వాచ్, హిట్లర్ మీసం, కొన ముక్కు, సూదుల్లాంటి కళ్లు. మనిషి అదోరకంగా ఉన్నాడు.

''ఏం పని మీద వచ్చారు?'' అదోరకంగానే ప్రశ్నించాడు.

''నేను మీ పక్కవాటాలో వుంటానండీ. కొత్తగా వచ్చాను''

''మంచిది. చెప్పండి''

''రాత్రి...'' కొంచెం సంకోచించాను.

''ఆ... ఏమయింది రాత్రి?''

''రాత్రి నేనొక పాట విన్నాను''

''ఊ...'' నిర్లక్ష్యంగా చూస్తున్నాడు.

''ఆ పాట చాలా బాగుందండీ''

''ఊ...''

''ఆ పాట ఎవరు పాడారో తెలుసుకోవచ్చునా?''

ఇంటి యజమాని మాట్లాడలేదు.

''ఊ...'' అన్నాడు ఇంకా చెప్పమన్నట్టు.

నాకు చాలా కోపం వచ్చింది. అయినా ఎవరిమీద చూపను? ఏ అధికారమున్నది నాకు ఆయనపై ఆయన ఇంటికి వచ్చి కోపం ప్రదర్శించడానికి

ఇంతలో పరదా కదిలింది.

ఆమె వచ్చి నిలబడింది.

సన్నగా నవ్వుతున్నది. నిజం మాట్లాడితే నవ్వడం కాదు. ఆమె ముఖమే అంత. హసన్ముఖి.

''రాత్రి మీరు పాడిన కిరణ్ పాట చాలా బాగుందండీ'' అన్నాను.

ఆమె నావైపు వింతగా చూసింది.

''ఔనండీ. చాలా అందంగా పాడారు. ప్రతి అక్షరానికీ ప్రాణం పోసారు. అందుకనే మిమ్మల్ని అభినందిద్దామని వచ్చాను''

ఆయన ముఖం నేను చూడదలచుకోలేదు. చూచే సాహసం లేదని చెప్పినా నాకు అవమానమేమీ లేదిప్పుడు.

నేనేదో అసామాన్యమైన పని చేస్తున్నాను. ఇంత దూరం వచ్చింది ఇంక భయమెందుకు?

''బాయ్'' ఇంటాయన బెల్ మ్రోగించాడు.


నా గుండెలో భయం బయలుదేరింది.

బాయ్ వచ్చాడు. ఇంటాయన నన్ను చూపించాడు

నౌకరుకు.

నా గుండె ఆగినంత పని అయింది.

''వెళ్లి వారికి కాఫీ తెచ్చి పెట్టు''



బాయ్ వెళ్ళిపోయాడు.

నేను ఆశ్చర్యం నుండి కొన్ని క్షణాలు తేరుకోలేదు. ఈ లోపల భర్త సంభాషణ ప్రారంభించాడు.

''చూడండి మిస్టర్! మనదేవూరు విశాఖా?''

ఆయన ఆ మాట ఏ ఉద్దేశ్యంతో అన్నాడో తెలీదు. ఇక నేను సహించలేకపోయాను.

''రంగధామ్‌గారూ!'' తీవ్రంగా మాట్లాడసాగాను. ఆయన పేరు రంగధామ్. వాకిట్లో బోర్డు చూశాను.

''మీ పద్ధతి నాకు నచ్చడంలేదు. పక్కింటివాడ్ని. ఇలా ఇంటికొచ్చిన పెద్దమనిషిని అవమానించడం ధర్మంకాదు''

''నేనూ అదే అందామనుకుంటున్నాను. మర్యాద ఇచ్చాను. కాఫీ ఇస్తున్నాను. మీరు ఏమన్నా ఓర్చుకుని ఊరుకున్నాను. అట్లాంటిది నీవు తెల్లవారకమునుపే మా ఇంటిమీదపడి ఇట్లా అల్లరి చేయడం భావ్యమేనా?''

''నేనా? అల్లరి చేసానా? మాటలు మర్యాదగా రానివ్వండి రంగధామ్‌గారూ''

రంగధామ్‌కు కోపం వచ్చింది. ''వ్వాట్ నాన్సెన్స్. మర్యాద గురించి నాకు చెబుతావ్. అరే... అసలేమిటిదంతా. ఇలా నా ఇంటికి వచ్చి మర్యాదగా మాట్లాడమని దబాయిస్తున్నావ్? ఎక్కడి ఖర్మ ఇది''

నాకూ కొంచెం కోపమూ, బాధా కలిగాయి. ''మహా వచ్చానులేవయ్యా మీ ఇంటికి లక్ష రూపాయలిచ్చినా నేను ఎవరింటికీ వెళ్లను తెలుసా?'' అన్నాను.

''ఉద్ధరించారు'' అన్నాడు రంగధామ్.

నిర్లిప్తంగా చూస్తున్నది ఆమె. అయితే సంభాషణల పర్యవసానం ఏమౌతుందో చూడాలన్న ఉత్సుకత మాత్రం కళ్లల్లో పరోక్షంగా మెరుస్తున్నట్లు గమనించాను.

బాయ్ కాఫీ తెచ్చి టేబుల్‌మీద పెట్టాడు. నేను తీసుకోలేదు.


''ఇంటకొచ్చిన అతిథికి ఇదేనా మర్యాద చేసే లక్షణం. నాకేమీ వద్దు లేవయ్యా నీ కాఫీ''


''చూడు మిస్టర్! నీ పేరేమిటో తెలియదు. నీ ప్రవర్తన చూసాక తెలుసుకోవాలనే కుతూహలం కూడా పోయింది. ఏమిటి నీవింకా భారతీయ ధర్మం అతిధి మర్యాద అంటున్నావ్? నేను కాబట్టి సరిపోయింది. ఇదే మరొకడైతే తన్ని వుండేవాడు''

పరిస్థితి విషమించవలసినంత వరకూ విషమించిందని గుర్తించాను.

''నేను చేసిన నేరమేమిటి?'' గట్టిగా అరిచాను.

''ఇదేమైనా భోగం కొంప అనుకున్నావటయ్యా పొద్దున్నే వచ్చి నీ భార్య పాట బాగుందని పొగడడానికి.




నీకు సిగ్గులేదా?'' ఆయన తారాస్థాయినందుకున్నాడు.

నేనూ నోరు విప్పి అనబోతుండగా ఆమె మాట్లాడింది.

''చూడండి'' అని. ఆ మూడు అక్షరాలు నన్ను పరవశుడ్ని చేసాయి. వాణి వీణ మీటినట్లుంది. ఒక్కసారి నేను గంధర్వలోకాలకు వెళ్లిపోయాను.

ఆమె మళ్లీ అడిగింది. ''మీరెవరు? పొద్దునే ఈ గొడవ ఏమిటి? చూడడానికి మర్యాదస్థులుగానే వున్నారు. ఏం కావాలి మీకు?'' నాకు కొంచెం దుఃఖం కలిగింది. కంఠం గాద్గదికమైంది. ''ఏం కావాలా? ఏం కావాలంటే అది ఇస్తావా అమ్మా?''

'అమ్మా' అన్న మాటను నేనెలా ఉచ్చరించానో నాకు తెలియదు. కానీ వారిరువురూ కదిలిపోయారు. నాకు తెలుసు ఆ రహస్యం.

మాతృప్రేమను చిన్నతనంలోనే పోగొట్టుకున్నవాడ్ని. తల్లి గారంతో గోరుముద్దలు తినిపిస్తే వుండే మాధుర్యం ఏమిటో?

క్షణంలో ఆయన ప్రవర్తనలో కొంచెం మార్పు కనబడింది.

ముఖం ఇందాకంత వికృతంగా లేదు.

''మీకు మా ఆవిడ పాట నచ్చిందంటారు. అంతేనా?'' అన్నాడు కొంచెం ఆగి.

''ఔను. అది గంధర్వగానం. పృథ్వీ స్పర్శలేని దివ్యనాదం'' అన్నాను ఆర్ద్రంగా.

అప్పుడామె ఇలా అన్నది.

''మీ ప్రశంసకు సంతోషం. కానీ మీరు కావాలనుకున్నది నేను మళ్లీ ఇవ్వలేను. ఎందుకంటే ఒక్క విషయం. మీరు గ్రహించలేకపోతున్నారు. రాత్రి నేను పాడింది రేడియోలో కాదు. మా ఇంటి డాబామీద మావారి కోసం. కాబట్టి ఆ స్వరాలు ఆయనకే అంకితం. మొత్తం సమాజానికి కాదు. అందువల్ల అది వినే అధికారం కాదు సరికదా ఇలా వచ్చి దానిపై వ్యాఖ్యానించే అధికారమూ, అవసరమూ కూడా మీకు లేదు. నేను ఏ సినిమాలోనో, టీవీలోనో, రేడియోలోనో వినిపిస్తే ఎక్కడైనా హాల్లో పాట కచేరీ చేస్తే మీరు వ్యాఖ్యానించవచ్చు. కానీ నేనది చేయలేదు. నా సౌందర్యంలాగే నా గొంతు కూడా ఆయనకే అంకితం కాబట్టి దానిని అన్యులు విని ఆనందించుకోవాలనుకోవడమూ, ఒకవేళ పొరపాటున విన్నా ఇలా ప్రత్యక్షంగా వ్యాఖ్యానించడం తప్పు కిందకే వస్తుంది'' అన్నది. ఆమె మాటలోని ప్రతి అక్షరం వెనుక వున్న తర్కం సహజంగానే వుందా?

ఆ మధురగానాన్ని హక్కు భుక్తం చేసుకునే అధికారం కేవలం ఆయనదేనా?

దైవమిచ్చిన ఈ గాంధర్వం దైవరూపంలోని మొత్తం సమాజానికి చెందకూడదా?

ఈ మాట అందామనుకున్నాను.

అన్నానని అనుకున్నాను.

కానీ అనలేదు. పెదవులు కదిలాయి. అంతే!

''క్షమించండి'' అని లేచాను.

''మంచిది'' అన్నాడాయన.

నేను రెండడుగులు వేసాను.

''ఇతరులు ఆమెను చూడడంగానీ, ఆమె మాట విని ప్రశంసించడం కానీ నాకు ఇష్టముండదు'' అన్నాడాయన నిర్మొహమాటంగా మళ్లీ.

నేను మారు మాట్లాడకుండా గుమ్మం దాకా వచ్చాను.


హసన్ముఖి లేచి నిలబడింది.

''నాకూ మావారికీ కిరణ్ రచనలంటే ఇష్టం. అందుకే వాటిని వెన్నెల వేళల్లో మళ్లీ మళ్లీ పాడించుకుని వింటుంటారు. అందులోని ప్రతి అక్షరం ఎప్పుడూ మా గుండెల లోలోపల ప్రతిధ్వనిస్తుంటాయి. అందుకే నేను పరవశించి పాడుతుంటాను. చిరుగాలి, సిరివెన్నెల, మబ్బులూ, మావారు వీరికే ఈ గానం పరిమితం. ఇంకోసారి వినడానికి ప్రయత్నించకండి'' అన్నదామె.

''విన్నావా మిస్టర్? అన్నట్లు నీ పేరు?'' అడిగాడాయన.

''కిరణ్. ఆ పాట వ్రాసింది నేనే'' అని చెప్పి గుమ్మం దిగి వెనుదిరిగి చూడకుండా వెళ్లిపోయాను.

★



## ఐశ్వర్య కొత్త స్నేహితుడు

నిన్నటి మంచి అమ్మాయి 'ఐశ్వర్యారాయ్‌కి మెల్లమెల్లగా కొంతమంది హిందీ హీరోయిన్‌ల అవలక్షణాలు ఒక్కొక్కటీ వచ్చేస్తున్నాయి. దురదృష్టవశాత్తూ ఆమె కొన్ని విషయాలలో 'మమతా కులకర్ణి', 'మనీషాకోయిరాల'లను ఆదర్శంగా తీసుకుంటున్నట్లుంది. ఆ మధ్య బాబీడియోల్‌తో కలసి తిరిగిందని అందరూ అనుకుంటున్న సమయాలలో ఆమె ఓ కెమెరామెన్ తోనూ 'డేటో' అని చూసినవాళ్ళు చెప్పుకొచ్చారు. ఆమధ్య సంగతి అటు పెడితే-ఈమధ్య జాకీష్రాఫ్ కౌగిలి కోసం ఐశ్వర్య అల్లాడిపోతోందని వార్తలు బయటకొచ్చాయి. జాకీ మొదట 'మనీషా' కోసం వెంపర్లాడినా ఆ తర్వాత ప్రపంచసుందరిని మాత్రం వదలడం ఎందుకని కాబోలు 'బొకే' పంపి తన సమ్మతి తెలియచేసాడు. ఆ మూడు అధ్యాయాల తర్వాత ప్రస్తుతం ఐశ్వర్య 'చంద్రచూడ్‌సింగ్' అనే హీరోను దగ్గరకు తీసుకుని లాలిస్తుందని బాలీవుడ్ పత్రికల బోగట్టా.. అన్నట్టు చంద్రచూడ్‌సింగ్ డ్రగ్ ఎడిక్ట్ అని వినికిడి. వయసు పైత్యం తలకెక్కితే, డ్రగ్ఎడిక్ట్‌లోనూ సుగుణాలు కనిపిస్తాయేమో! ఐశ్వర్యకు వయసు పైత్యం బాగానే తలకెక్కినట్టుంది.

-జె.వి.బాబు